ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 18 ఆగస్టు 2024



ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన.. బదిలీలు

- రేపటి నుంచి నెలాఖరులోగా ప్రక్రియ
- కోరుకున్న స్థానం కోసం కొంతమంది పైరవీలు
- ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు

ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నెల 19 నుంచి 31వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించింది. కాగా.. బదిలీల నేపథ్యంలో ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు కొంతమంది ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. కోరుకున్న చోట కొలువు దీరేందుకు పైరవీలు సాగిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉద్యోగుల బదిలీలపై ఇంతవరకూ ఉన్న నిషేధాన్ని ఎత్తివేయనుంది. ఈ నెల 19 నుంచి 31లోగా బదిలీల ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి సాధారణ బదిలీలపై యథావిధిగా నిషేధం అమల్లో ఉంటుంది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీ ప్రక్రియ చేపట్టనుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొంతమంది అధికారులు వైసీపీ నేతలతో అంటకాగి ఇష్టారాజ్యంగా విధులు నిర్వహించారు. దీంతో ప్రభుత్వ శాఖల ప్రగతి పడకేసింది. ఈ నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం.. ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తూనే.. వ్యవస్థ ప్రక్షాళనపై దృష్టి సారించింది. ఈ క్రమంలో బదిలీల ప్రక్రియకు సన్నద్ధమవుతోంది. ముందుగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరే శాఖల్లో బదిలీలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. రెవెన్యూశాఖలో కొంతమంది అధికారులు.. రకరకాల సిఫారసులతో ఒకే సీటులో కొనసాగుతున్నారు. ఇటువంటి వారిని బదిలీతో కదిలించే అవకాశం ఉంది.

● కొన్ని శాఖలు మాత్రమే..

వైద్యఆరోగ్య, విద్యా శాఖల్లో బదిలీలు లేవు. కో-ఆపరేటివ్, ప్రణాళిక విభాగం, ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు వంటి ఇతరత్రా శాఖలలోనూ బదిలీలు లేవు. కేవలం రెవెన్యూ సమకూర్చే శాఖలైన... "రిజిస్ట్రేషన్, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, విద్యుత్, పరిశ్రమలు, రవాణా, ఫారెస్ట్, దేవదాయ, అన్ని ఇంజనీరింగ్ విభాగాలు, సివిల్ సప్లయ్, మైన్స్, గ్రామ/వార్డు సచివాలయాలు, మునిసిపల్ కార్పొరేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల సిబ్బంది మాత్రమే బదిలీలకు అర్హులు. గ్రామం లేదా పట్టణం, నగరంలో గరిష్ఠంగా ఐదేళ్ల ఒకేచోట విధులు నిర్వహించిన ఉద్యోగి తప్పనిసరి బదిలీ కావాల్సిందే. మిగిలినవారు కూడా జీరో సర్వీస్‌పై రిక్వెస్ట్ బదిలీకి అర్హులవుతారు. ఇక ఉద్యోగ సంఘాల నేతలకు బదిలీకి సంబంధించి ఒకే స్థానంలో తొమ్మిదేళ్ల వరకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది.

● సిఫారసు చేయరూ..

రెవెన్యూ సమకూర్చిన శాఖల్లో కొంతమంది కీలక అధికారులు.. కింది స్థాయి సిబ్బంది గత ప్రభుత్వ అక్రమాల్లో సహకరించారు. మరికొంతమంది అక్రమాలకు ఆస్కారం కలిగించేలా కిటుకులు చెబుతూ అప్పటి ప్రజాప్రతినిధులతో తమవారు అన్న గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు అదే అధికారులు, సిబ్బంది.. గత రెండు నెలలు నుంచి ముందస్తుగానే బదిలీల్లో తమకు సిఫారసు చేయాలని ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పాత విషయాలు విడిచిపెట్టి.. తాము కోరుకున్న ప్రాంతానికి బదిలీచేస్తే.. మరింత నమ్మకంగా పని చేస్తామంటూ పైరవీలు సాగిస్తున్నారు. ఉదాహరణకు.. రెవెన్యూ, మైన్స్.. ఎక్సైజ్, సివిల్ సప్లయ్ వంటి విభాగాల్లో కీలక స్థానాల్లో పనిచేసినవారు... ఇప్పుడు అక్కడ నుంచి వదులుకోలేక... అలాగే ప్రస్తుతమున్న స్థానం చుట్టుపక్కల అవకాశం ఉండేలా కోరుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వ ప్రతినిధులు కూడా ఆచితూచి వ్యవహరించాల్సి ఉంది. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగాలంటే.. కలెక్టర్‌కు సిఫారసులు చేయకుండా ఉంటేనే ప్రక్షాళనకు వీలుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎవరు ఉంటారో.. ఎవరు వెళ్తారో!

సచివాలయ వ్యవస్థ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించి వారి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. పనిలేని ఉద్యోగులను వారి అనుబంధ శాఖలకు పంపేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎవరు ఉంటారో, ఎవరు వెళ్తారోనని సచివాలయ ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది.

- సచివాలయ వ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం
- ఉద్యోగుల సర్దుబాటుకు కసరత్తు
- ఇప్పటికే వివరాల సేకరణ

(మెళియాపుట్టి)

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ఒక్కో గ్రామ సచివాలయంలో 11 మంది వరకు ఉద్యోగులను నియమించింది. అయితే, వీరికి పక్కాగా జాబ్‌చార్ట్ అమలు చేయడంలో విఫలమైంది. దీంతో ఉదయం సచివాలయాలకు వచ్చే ఉద్యోగుల్లో కొందరికి పని ఉండేది కాదు. వీరంతా బయోమెట్రిక్ వేసి తిరిగి ఇంటికి వెళ్లిపోయేవారనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది ఉద్యోగులు మాత్రం అధిక పని ఒత్తిడితో సతమతమయ్యేవారు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా క్లస్టర్లగా సచివాలయాలను విభజించి ఉద్యోగులను ఉంచటానికి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 732 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో వార్డు సచివాయాలు 85, గ్రామ సచివాలయాలు 647 ఉన్నాయి. ఉద్యోగులు 6,868 మంది అవసరం ఉండగా 6,034 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో 452 మంది ప్రొబేషన్‌కు అర్హత సాధించారు. చాలామంది ఉద్యోగులకు పనిలేకుండా గత ప్రభుత్వం జీతం చెల్లించిందనే విమర్శలు ఉన్నాయి. అన్ని సచివాలయాల్లో సర్వేయర్లు ఉన్నారు. వీరికి పెద్దగా పనిలేదు. పట్టణాల్లో నెలలు తరబడి ఖాళీగా ఉంటున్నారు. మరికొంత మందికి నెలలో ఒక్కరోజు కూడా పని ఉండడం లేదు. ఇదే సమయంలో సర్వేల్యాండ్ రికార్డు శాఖ సిబ్బంది కొరత ఉంది. అన్ని సచివాలయాల్లో పశుసంవర్ధశాఖ సహాయకులు ఉన్నా వారికి అంతగా పని ఉండడం లేదు. విద్యాశాఖ సహాయకులు సేవలకు పరిమితంగా ఉన్నారు. ఇలాంటి సిబ్బందిపై ప్రభుత్వం దృష్టిసారించనుంది. అధికంగా పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్నవారిలో 20 శాతం మందిని సర్దుబాటు చేయనున్నట్లు తెలుస్తోంది.

ఉండేది వీరేనా?

క్లస్టర్ విధానం తీసుకువచ్చి ఇందులో వైద్య, ఇంజనీరింగ్, మహిళాపోలీస్, విద్య, శానిటరీ, వీఆర్వో, కార్యదర్శి, పరిపాలన సహాయకులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇతర శాఖలకు సర్దుబాటు చేయాల్సిన సిబ్బంది వివరాలను ఇప్పటికే సేకరించారు. వారు ఉద్యోగంలో ఎప్పుడు చేరారు, విద్యార్హత, తదితర సమాచారం తీసుకున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మునిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో వీరు పనిచేస్తున్నారు. మార్పులు, చేర్పులు చేసి వీరిని మానిటరింగ్ చేసే ఉన్నతాధికార్లను కూడా ప్రభుత్వం నిర్ణయించనున్నట్లు తెలిసింది. కాగా, సచివాలయ వైద్యసిబ్బంది అధికంగా పని ఒత్తిడికి గురవుతున్నారు. ఇటు సచివాలయం, అటు వైద్యశాఖ మధ్య నలిగిపోతున్నట్లు వారు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఒకేరోజు రెండు శాఖల సమావేశాలైతే ఎటువైపు వెళ్లాలో తెలియక ఆందోళ చెందుతున్నారు. వీరిని వైద్యశాఖ పరిధిలోకి తీసుకువస్తే మంచిదని ఆ శాఖ ప్రతినిధులు చెబుతున్నారు.



శ్రీకాకుళంలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకపోతే ఎలా?

- కోల్‌కతా ఘటనకు నిరసనగా భారీ ర్యాలీ
- బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలి
- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.నర్సింహమూర్తి



శ్రీకాకుళంలో ఐఎంఏ వైద్యుల నిరసన

అరసవల్లి, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు జిల్లాలో వైద్యులు ఆందోళన బాట పట్టారు. శనివారం జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, వివిధ అనుబంధ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మద్దతుతో శ్రీకాకుళంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శనివారం ఉదయం నుంచీ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ వైద్య సేవలను బహిష్కరించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్) నుంచి వందలాది మంది వైద్యులు, సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు స్థానిక డే అండ్‌నైట్ జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. 'వైద్యులకు రక్షణ కల్పించాలి. బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలి' అని నినాదాలు చేశారు.

● ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సనపల నర్సింహమూర్తి మాట్లాడుతూ.. 'కోల్‌కతాలో జరిగిన దారుణ ఘటన.. మరోసారి వైద్యుల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం స్పందించి వైద్యులు, సిబ్బంది రక్షణకు సంబంధించి కఠినమైన చట్టాన్ని తీసుకురావాలి. అంతవరకు పోరాటాన్ని ఆపేది లేదు. ప్రాణాలు పోసే వైద్యుల ప్రాణాలకు రక్షణ లేకపోతే.. ఇక ఎలా వైద్యసేవలు అందించగలమ'ని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐదేళ్ల కిందట కూడా ఇటువంటి సంఘటన జరిగినా.. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విచారణను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గొండు గంగాధరరావు, కోశాధికారి డా. కె.సోమేశ్వరరావు, డా.లుకలాపు ప్రసన్నకుమార్, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ ఎంవీ సత్యానంద్, డా.చింతాడ భాస్కరరావు, జూనియర్ వైద్యుల సంఘం నాయకులు డా.జి.వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే జెమ్స్ ఆస్పత్రి, సాయి డెంటల్ కాలేజీ, రిమ్స్ నర్సింగ్ అసోసియేషన్స్, కాంట్రాక్టు, సెక్యూరిటీ, పారామెడికల్ సిబ్బంది, కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్, జేసీఐ, వివిధ సంఘాల సభ్యులు నిరసన ర్యాలీ చేపట్టారు.

అర్జీలను స్వయంగా పరిశీలించండి

- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కలెక్టరేట్, ఆగస్టు 17: "మీ కోసం" ప్రజా ఫిర్యాదు వేదికలో వచ్చే అర్జీలను అధికారులు స్వయంగా పరిశీలించి, అంకితభావంతో పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత పెరగాలి. 'మీ కోసం' వినతుల పరిష్కారాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు లేదు' అని స్పష్టం చేశారు. అలాగే వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా వివిధ శాఖలు నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రగతిపై సమీక్షించారు. డ్వామా పీడీ, డీపీవో, పంచాయతీ రాజ్ ఎస్ఈ, డీఆర్వో ప్రణాళికలను వివరించారు.

సాధనతోనే విజయాలు

- ఎమ్మెల్యే కూన రవికుమార్
- రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 17: క్రీడాకారులకు కఠోర సాధనతోనే విజయాలు లభిస్తాయని ఆమదాలవలస ఎమ్మెల్యే, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చీఫ్‌ప్యాట్రన్ కూన రవికుమార్ తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. అనంతరం కూన రవికుమార్ మాట్లాడుతూ 'జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో క్రీడలపై ఆసక్తి చూపుతున్నారు. సాఫ్ట్‌బాల్‌లో జాతీయస్థాయి సత్తాచాటిన వారు ఎందరో ఉన్నారు. క్రీడాకారులు మరింతగా రాణించాల'ని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ క్రీడాకారులకు తర్ఫీదు పొందేందుకు కొద్దినెలల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కోడిరామ్మూర్తి స్టేడియం అందరికీ అందుబాటులో ఉండేలా పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధులు కలిదిండి నరసింహరావు, కలిదిండి వెంకటరమణ, డా.బొడ్డేపల్లి సురేష్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్యసలహాదారు పి.సుందరరావు, హనుమంతు సాయిరాం, సూరశ్రీనివాసరావు, బడగల హరిధరరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, కె.మాధవరావు, బాడాన దేశ భూషన్, నటుకుల మోహన్, సత్యనారాయణ పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్

బీఆర్‌ఏయూలో ఆడిట్ సెల్

ఎచ్చెర్ల, ఆగస్టు 17: బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఆడిట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. వర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంటు విభాగం(డీసీఎం ఎస్)కు చెందిన డాక్టర్ ఎస్.తారకేశ్వరరావును ఈ సెల్‌కు డైరెక్టర్‌గా నియమిస్తూ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీలో అకౌంటింగ్, బ్యాంకింగ్ వ్యవహారాల్లో అంతర్గత ఆడిట్ సక్రమంగా జరిగేలా చూడాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత పాల్గొన్నారు. కాగా, డీసీఎంఎస్‌కు చెందిన అధ్యాపకులు బి.ప్రకాష్‌బాబు, ఎం.రాంజీ నాయక్, టి.సంతోష్‌పావనితో పాటు వి.జనార్దనరావు (రిటైర్డ్ డీఏవో రాష్ట్ర ఆటిట్ శాఖ), ఎస్‌వీ రమణ (పరిపాలనా కార్యాలయం, బీఆర్‌ఏయూ)ను సభ్యులుగా నియమించారు.

వారంతే.. పట్టించుకోరు!


బుచ్చివాని చెరువు మధ్యలో ఏర్పాటు చేసిన రోడ్డు


- ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకే పరిమితం
- యథేచ్ఛగా బుచ్చివాని చెరువు కబ్జా
- అక్రమంగా సీసీ కల్వర్టు, రోడ్డు నిర్మాణం

(రణస్థలం)

సాధారణంగా భూ కబ్జాలు, ఆక్రమణలు వెలుగులోకి వస్తే.. అధికారులు వెంటనే చర్యలకు దిగాలి. అక్రమార్కులకు నోటీసులు ఇవ్వాలి. ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి. ఆ భూములు ప్రభుత్వానివి అని.. ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ బోర్డులు పెట్టాలి. కానీ రణస్థలం మండలంలో మాత్రం అందుకు విరుద్ధం. ఇక్కడ భూ ఆక్రమణలు వెలుగులోకి వస్తే అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రణస్థలం మండలం కోటపాలెం రెవెన్యూ పరిధిలోని బుచ్చివాని చెరువు ఆక్రమణపై గతనెల 23న 'రూ.30కోట్ల భూమి హంఫట్' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులు స్పందిస్తూ.. కేవలం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. అక్కడున్న ఆక్రమణలు తొలగించలేదు. చెరువు భూమిని తవ్వి ఏర్పాటు చేసిన రోడ్డును, కల్వర్టును ధ్వంసం చేయలేదు. చెరువు భూమిలో ఉన్న కొబ్బరిచెట్లను స్వాధీనం చేసుకోలేదు. వారు చేసిందల్లా కేవలం 'ఇది ప్రభుత్వ భూమి.. ఆక్రమిస్తే శిక్షార్హులు' అని ఫ్లెక్సీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ అధికారుల తీరుపై అనుమానాలు వస్తున్నాయి.

ఆక్రమణల పర్వం ఇలా..

కోటపాలెంలో సర్వే నంబర్ 258/2లో 30.16 ఎకరాల విస్తీర్ణంలో బుచ్చివాని చెరువు ఉంది. ఈ చెరువు పరిధిలో 350 ఎకరాల ఆయకట్టు ఉంది.


నిర్మాణంలో ఉన్న కల్వర్టు


పై ప్రాంతాల నుంచి బుచ్చివాని గెడ్డ ఉంది. ఇది పూర్తిగా వర్షాధారం చెరువు. ముందు ప్రాంతాల్లో వర్షం పడితే గెడ్డ ద్వారా నీరు వచ్చి చెరువులో చేరుతుంది. ఖరీఫ్‌లో వరితో పాటు రబీ పంటలకు సైతం ఈ చెరువు ద్వారా సాగునీరందేది. చెరువులో నీరు ఉండడంతో భూగర్భ జలాలు పైకి ఉండి వ్యవసాయ పంపుసెట్లకు నీరు అందేది. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో అక్రమార్కుల దృష్టి ఈ చెరువుపై పడింది. గత ఐదేళ్లలో ఆక్రమణల బారినపడి ఈ చెరువు కుచించుకుపోయింది. 20 ఎకరాల పాటు కబ్జాకు గురైంది. కేవలం 10ఎకరాల చెరువు గర్భమే మిగిలింది. స్థానిక ఓ వైసీపీ నాయకుడు కబ్జాపర్వాన్ని నడిపించాడు. తనను ప్రశ్నించేవారిని ఎంపిక చేసి.. కొద్దిపాటి భూమిని వారి స్వాధీనంలో పెట్టాడు. సింహభాగం మాత్రం తానే కబ్జా చేశాడు. ఏకంగా కొబ్బరి మొక్కలు నాటాడు. కేవలం చెరువు గర్భంతో ఆయన దాహం తీరలేదు. మరో వైసీపీ నాయకుడు తన భూమికి వెళ్లడానికి కిలోమీటర్ పరిధిలో రహదారి నిమిత్తం ఏకంగా బుచ్చివాని గెడ్డను ఆక్రమించి 15 అడుగుల వెడల్పులో రోడ్డు నిర్మించేశాడు. చెరువు గర్భంలోను 32 పైపులను వినియోగించి ఏకంగా సీసీ కల్వర్టు కట్టేశాడు. ఇంత జరిగినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు ఆక్రమణకు గురికావడంతో తమకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు మామూళ్లు, మరోవైపు రాజకీయ ఒత్తిళ్లతో అక్రమార్కులపై అధికారులు చర్యలకు ఉపక్రమించడం లేదని విమర్శిస్తున్నారు. కేవలం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారని, ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే.. పోరాటం చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

దిక్సూచి
DIKSUCHI

నేషనల్ లా స్కూల్లో లీగల్ ప్రోగ్రామ్‌లు



బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్), పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ప్రొఫెషనల్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్(పీఏసీఈ) కింద బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ సెషన్స్, హైబ్రిడ్ ప్రోగ్రామ్స్ ఉంటాయి.

మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో పది కోర్సులు ఉంటాయి. మొదటి ఏడాది కాంట్రాక్ట్ లా, బ్యాంకింగ్ లా, కార్పొరేట్ లా, ఇండస్ట్రియల్ రిలేషన్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా కోర్సులు; రెండో ఏడాది ఇన్వెస్ట్‌మెంట్ లాస్, ఇన్సూరెన్స్ లాస్, ఇంటర్నేషనల్ కమర్షియల్ ట్రాన్సాక్షన్స్ అండ్ ఫారిన్ ట్రేడ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లాస్, టాక్సెస్ ఆన్ కార్పొరేషన్స్ కోర్సులు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు లా ఆఫీసర్, లీగల్ అసిస్టెంట్, లీగల్ అడ్వైజర్‌గా రాణించవచ్చు.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఆర్బిట్రేషన్ లా, చైల్డ్ రైట్స్ లా, కన్జ్యూమర్ లా అండ్ ప్రాక్టీస్, సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, ఎన్విరాన్‌మెంటల్ లా, హ్యూమన్ రైట్స్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా, మెడికల్ లా అండ్ ఎథిక్స్, టాక్సేషన్ లా స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఈ ప్రోగ్రామ్ జర్నలిస్ట్‌లు, అడ్వకేట్‌లు, రైట్స్ యాక్టివిస్ట్‌లు, డాక్టర్‌లు, నర్స్‌లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌లు, హెల్త్ వర్కర్‌లు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్, ఎన్‌జీఓలు, లీగల్-ఎడ్యుకేషనల్-రీసెర్చ్ విభాగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ కోర్సులు పూర్తిచేసినవారు; ఓపెన్ యూనివర్సిటీలలో చదివినవారు; డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీలు పొందిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** https://pace.nls.ac.in/

డా.ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్ అనుబంధ కళాశాలల్లో

మేనేజ్‌మెంట్ కోటా


విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్&డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్ఆర్ఐ) సీట్లు; తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతీ మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లోని ఎన్ఆర్ఐ సీట్లు; నూతనంగా అనుమతించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని కాంపిటెంట్ అథారిటీ కోటా(సెల్ఫ్ ఫైనాన్సింగ్/ఎన్ఆర్ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలలు, సీట్ల వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 720-162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 161-127; జనరల్/ఈడబ్ల్యూఎస్ దివ్యాంగులకు 161-144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్ఆర్ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసు కోవాలి. నూతన మెడికల్ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూలో బీఆర్క్



కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూ)- బీఆర్క్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, మైనారిటీ కళాశాలల్లో నాటా 2024 స్కోర్ ఆధారంగా లోకల్, నాన్ లోకల్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

కళాశాలలు-సీట్లు

- ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం-44 కన్వీనర్ కోటా సీట్లు
- డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కడప-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఏఎన్‌యూ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, గుంటూరు-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఎంఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, భీమవరం- 15 కన్వీనర్ కోటా సీట్లు, 6 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు
- చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, తిరుపతి-28 కన్వీనర్ కోటా సీట్లు, 12 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత తప్పనిసరి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ఈ మెయిల్ ద్వారా కరెక్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 26 నుంచి 27 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 29
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్:** ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2 వరకు
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://apsche.ap.gov.in/arch/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sS6GAamలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. శనివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.



హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వారియర్ స్టోరీ

ప్రభాస్ కొత్త చిత్రం శనివారం ఉదయం మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. ఇన్‌స్టాలో తన వీడియాలతో అందరినీ ఆకట్టుకొన్న ఇమాన్వీ ఎస్మాయిల్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో 'పరిత్రాణాయ సాధూనాం' అంటూ భగవద్గీత శ్లోకాన్ని ప్రచురించారు. 'ఆపరేషన్ జెడ్' అని మరొక చోట పేర్కొన్నారు. అలాగే ఈ సినిమా క్లాప్ బోర్డ్ మీద కోల్‌కతా హౌరా బ్రిడ్జ్, సుభాష్ చంద్రబోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' పతాకం, చార్మినార్‌ ఉండడం ఆసక్తిరేకెత్తిస్తోంది. 1940 బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఈ చిత్రకథలో ప్రభాస్ వారియర్‌గా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఫొటోగ్రఫీ: సుదీప్ ఛటర్జీ, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

మెల్‌బోర్న్‌లో మువ్వన్నెల రెపరెపలు



మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌కు రామ్‌చరణ్ గౌరవ అతిథిగా హాజరైన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్ పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. ఏటా ఈ పురస్కారం అందుకున్న వ్యక్తులు భారత జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఫెడరేషన్ స్క్వేర్‌లో ఘనంగా జరిగిన వేడుకల్లో రామ్‌చరణ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ఐఎఫ్ఎఫ్ఎం పురస్కారాల ప్రధానం

ఐఎఫ్ఎఫ్ఎం చిత్రోత్సవాల్లో విజేతలకు పురస్కారాలను ప్రధానం చేశారు. చందు ఛాంపియన్ చిత్రానికి గాను కార్తిక్ ఆర్యన్ ఉత్తమ నటుడి పురస్కారం స్వీకరించారు. ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని కబీర్‌ఖాన్, నిథిలన్ స్వామినాథన్ (మహారాజా)తో కలసి అందుకున్నారు. ఉత్తమ నటిగా పార్వతి తిరువోతు, ఉత్తమ చిత్రంగా 'ట్వెల్త్ ఫెయిల్' పురస్కారాలను దక్కించుకున్నాయి. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటుడి పురస్కారం విక్రాంత్‌మాసేకు దక్కింది. సంగీత దర్శకుడు ఏ. ఆర్ రెహమాన్ విశిష్ట పురస్కారం స్వీకరించారు.

ప్రేక్షకులు దూరమైంది అందుకే

\- దిల్‌రాజు



'ప్రేక్షకుల్ని చెడగొట్టింది మేమే.'మీరు ఇంట్లోనే కూర్చోండి.. నాలుగు వారాల్లో సినిమాను ఓటీటీలో చూపిస్తాం' అని వారిని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం' అని నిర్మాత దిల్‌రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రేవు' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా తీయడం గొప్ప కాదు. ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడం ముఖ్యం' అన్నారు. 'రేవు' సినిమా కాన్సెప్ట్ బాగుంది. ఈ చిత్రాన్ని చూసి నేనూ రివ్యూ రాస్తా' అన్నారు దిల్ రాజు. నిర్మాతల్లో ఒకరైన మురళి మాట్లాడుతూ 'ఒక మంచి చిత్రంతో నా సినీ జర్నీ మొదలైంది. మా సినిమాను చూసి ఆదరించండి' అని కోరారు. తక్కువ బడ్జెట్‌లోనే ఎంత అద్భుతంగా సినిమా తీయవచ్చో దర్శకుడు హరినాథ్ నిరూపించారు' అని ప్రభు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు పాల్గొన్నారు.

గాయని పి. సుశీలకు అస్వస్థత



ప్రముఖ గాయని పి. సుశీల శనివారం అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పితో ఆమె చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కొంతకాలంగా సుశీల అనారోగ్యంతో బాధపడుతున్నారు.

ఇన్ ప్రోగ్రెస్



'ఆయ్' టీమ్‌కు ఎన్టీఆర్ అభినందనలు

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా రూపొందిన 'ఆయ్' చిత్రం ఇటీవల విడుదలై సూపర్ హిట్ టాక్ సాధించింది. ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూలు కూడా రావడంతో టీమ్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. శనివారం యూనిట్ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్‌ను కలుసుకుని ఆయన అభినందనలు పొందారు. బాక్సాఫీసు దగ్గర గట్టి పోటీ ఉన్నప్పటికీ 'ఆయ్' హిట్ కావడంతో ఎన్టీఆర్ వారిని అభినందించారు. నార్నే నితిన్, నయన్ సారిక, అంకిత్ కొయ్య, నిర్మాతలు బన్నీ వాసు, ఎస్.కె.ఎన్. శనివారం ఎన్టీఆర్‌ను కలిశారు.

రోషన్ హీరోగా 'ఛాంపియన్'



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటించే కొత్త చిత్రం 'ఛాంపియన్' షూటింగ్ శనివారం మొదలైంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ను దర్శకుడు నాగ్‌అశ్విన్ తొలి క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. సరికొత్త పాత్రలో రోషన్‌ను ప్రజెంట్ చేయడానికి ఓ విభిన్నమైన స్క్రిప్ట్‌ను దర్శకుడు ప్రదీప్ సిద్ధం చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆర్. మది, కళా దర్శకుడు: తోట తరణి, నిర్మాణం: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్.

భయపెట్టేందుకు సిద్ధం



అరుల్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ 2'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వంలో విజయ్ సుబ్రహ్మణ్యన్, ఆర్. సి రాజ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

కోరం లేక దంత ఎస్‌ఎంసీ చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా

కోటబొమ్మాళి: కోరం లేకపోవడంతో దంత ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. శనివారం 8 తరగతులకు గాను 5 తరగతుల్లో మెంబర్లను ఎన్నుకున్నారు. మూడు తరగతుల్లో కోరం పూర్తికాక ఎన్నుకోలేదు. పోటీ చేస్తున్న ఇరు వర్గీయులు పాఠశాలకు చేరుకున్నప్పటికీ కోరం మూడు తరగతులకు లేకపోవడంతో మరో మారు వాయిదా వేశారు. గతంలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో పునరావృతం కాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల తేదీని త్వరలోనే మళ్లీ ప్రకటిస్తామని ఎన్నికల అధికారి, హెచ్‌ఎం గొండు నారాయణరావు తెలిపారు. టెక్కలి సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోటబొమ్మాళి ఎస్‌ఐ షేక్‌మహ్మద్ అలీ, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పూశాంలోనూ..


ఎల్‌ఎన్‌పేటలో చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణం చేయిస్తున్న హెచ్‌ఎం

ఎల్.ఎన్.పేట: పూశాం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక కోరం లేక మరోసారి వాయిదా వేసినట్లు ఎంఈవోలు సీహెచ్ మణికుమార్, కె.చంద్రమౌళి తెలిపారు. 7వ, 9వ తరగతుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిలిపి వేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా లక్ష్మీనర్సుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్‌ఎంసీ ఎన్నికకు ఉత్కంఠ నెలకొంది. గ్రామంలోని కొందరు వైసీపీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులను రాకుండా చేయడంతో విషయం తెలుసుకుని సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.నిహార్ పాఠశాల వద్దకు వచ్చి సంబంధిత వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. అనంతరం ఎన్నికల అధికారి, హెచ్‌ఎం వై.సింహాచలం ఎన్నికను నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా ఇ.కృష్ణ, వైస్ చైర్మన్‌గా బి.జయశ్రీలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. చింతలబడవంజ ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌గా పి.నర్సింగరావు, వైస్ చైర్మన్‌గా జి.దేవిలను ఎన్నికల అధికారి, హెచ్‌ఎం ఎస్.ఫణిరాజు ప్రకటించారు.

కణితివూరులోనూ..


పెద్దబాణాపురం ఉన్నత పాఠశాల వద్ద పోలీస్ బందోబస్తు

నందిగాం: కణితివూరు, పెద్దబాణాపురం ఉన్నత పాఠశాలల ఎస్‌ఎంసీ ఎన్నికలను శనివారం పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. అయితే కణితివూరు ఎన్నికకు సంబంధించి కోరం లేకపోవడంతో వాయిదా పడింది. ఎంఈవో-2 ఎ.చిన్నారావు పర్యవేక్షణలో డిప్యూటీ డీఈవో పి.విలియమ్స్ ఎన్నిక ప్రక్రియకు హాజరైనప్పటికీ తల్లిదండ్రులు అవసరమైన కోరం లేక వాయిదా వేశారు. తొలిసారి ఈనెల 8న ఇక్కడ వివాదం కారణంగా వాయిదా పడగా, రెండోసారీ కోరం లేక వాయిదా వేశారు. పెద్దబాణాపురం ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నిక హోరా హోరీగా సాగింది. ఎస్‌ఐ మహ్మద్ అమీర్ ఆలీ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించగా ఎంఈవో-1 జి.నర్సింహులు పర్యవేక్షణలో హెచ్‌ఎం బమ్మిడి జగన్నాథరావు ఎన్నిక నిర్వహించారు. ముందుగా తొమ్మిదో తరగతికి సంబంధించి ముగ్గురు సభ్యులను ఎన్నిక ద్వారా ఎంపిక చేసిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరిపారు. చైర్మన్‌గా అర్జమి పుష్పవతికి 14 ఓట్లు, కొండాల జ్యోతిరాణికి 10 ఓట్లు రావడంతో పుష్పవతి చైర్మన్‌గా ఎన్నికైనట్లు హెచ్‌ఎం ప్రకటించారు. వైస్‌చైర్మన్‌గా పి.జోగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మోడల్ స్కూల్ కమిటీ కమిటీ ఎన్నిక

ఈదులవలస(పోలాకి): ఈదులవలస మోడల్ స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. చైర్మన్‌గా దండుపాటి ఎర్రయ్య, ఉపాధ్యక్షురాలిగా బమ్మిడి పార్వతి ఎన్నికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.శ్రీరామమూర్తి తెలిపారు. గత వారం జరగాల్సిన ఎస్‌ఎంసీ ఎన్నిక తల్లిదండ్రుల కోరం లేక, వైసీపీ, టీడీపీ తోపులాట మధ్య వాయిదా పడిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించామన్నారు. పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రుల ఆధార్ కార్డులను పోలీసులు, పాఠశాల సిబ్బంది పరిశీలించి లోపలకు అనుమతించారు. ఎటువంటి ఘటనలు జరగకుండా నరసన్నపేట సీఐ జే.శ్రీనివాసరావు, పోలాకి ఎస్‌ఐ వి.సత్యనారాయణ, ఏఎస్‌ఐ కె.జగన్నాథరావు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిశారు.

ప్రశాంతంగా..

హిరమండలం: మండలంలో మూడు పాఠశాలల్లో వాయిదా పడిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను శనివారం నిర్వహించారు. హిరమండలం ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్‌గా సింహాద్రి కల్యాణి, గొట్ట ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్‌గా దాసరి స్వాతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిన్న కొల్లివలస పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల కోరం లేక వాయిదా వేసినట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. ● **కొత్తూరు:** తొలి విడతలో వాయిదా పడిన కడుం ఉన్నత పాఠశాల, కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. కడుం పాఠశాల కమిటీకి చైర్మన్‌గా బూరాడ రమేష్, వైస్ చైర్మన్‌గా కె.జయసుధ ఎన్నికయ్యారు. కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా కూనపిల్లి రవి, వైస్‌చైర్మన్ కొట్నాల సరస్వతి ఎన్నికయ్యారు.

మానవత్వం చాటుకున్న పంచాయతీ, పోలీసు సిబ్బంది

● అపస్మారక స్థితిలో ఉన్న బిచ్చగాడిని ఆసుపత్రిలో చేర్పించిన వైనం


అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని పరిశీలిస్తున్న దృశ్యం

నరసన్నపేట: నాలుగు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ అపస్మారక స్థితిలో ఉన్న ఓ బిచ్చగాడిని స్థానికులు, పోలీసులు, పంచాయతీ సిబ్బంది ఆసుపత్రిలో చేర్పించి మానవత్వం చాటు కున్నారు. వివరాలిలా ఉన్నాయి.. జమ్ము జంక్షన్ వద్ద అండర్ బిడ్జి కింద అపస్మారక స్థితిలో ఉన్న ఒక బిచ్చగాడి పరిస్థితిని స్థానికులు చూసి పంచాయతీ ఈవోకి సమాచారం ఇచ్చారు. పంచాయతీ సిబ్బంది పోలీసుల సాయంతో అతడికి సపర్యలు చేసి 108 వాహనంలో స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. అతడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రాణాపాయంతో కొట్టి మిట్టాడుతున్న బిచ్చగాడిని ఆసుపత్రిలో చేర్పించిన పంచాయతీ సిబ్బంది, పోలీసులను స్థానికులు అభినందించారు.

ఉపాధి పనికి రాని వారి పేర్లు మస్తర్లలో నమోదు

కోటబొమ్మాళి: కొత్తపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పథకంలో పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు బయటపడింది. గ్రామంలో లేని వారు పనులు చేపట్టినట్లు మస్తర్లలో నమోదు చేసి చెల్లింపులు కూడా చేసిన బాగోతం వెలుగుచూసింది. శనివారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి పనికి రాకుండా ఆయన పేరున చెల్లింపులు జరిగాయని వెల్లడి కాగా ఆయన భార్య సమావేశానికి వచ్చి జాబ్ కార్డులో నా పేరు లేని కారణంగా మా ఆయన పేరున పని చేసినట్లు అధికారుల ఎదుట తెలిపింది. గ్రామానికి చెందిన 32 మంది వేతనదారులు ఒక్కొక్కరి నుంచి మేట్లు వారానికి రూ.100 వసూలు చొప్పున చేసినట్లు సామాజిక తనిఖీల్లో డీఆర్పీ గుర్తించారు. అలాగే గ్రామంలో ఎప్పుడో వేసిన పునాదులకు ఉపాధి హామీలో బిల్లు చెల్లించినట్లు గ్రామస్థులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వేతనదారు శంకర్ పనిలోకి పూర్తిగా రాకపోయినా ఆయన పేరు మస్టర్లలో నమోదు చేసి అతని వద్ద నుంచి రూ.6 వేలు మేట్లు తీసుకున్నట్లు ఆయన సభలో వెల్లడించారు. సుమారు 100 మంది వేతనదారులు పనికి వెళ్లనప్పటికీ వారికి వందరోజులు పని కల్పించినట్లు రికార్డుల్లో నమోదైనట్లు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎస్ఆర్పీ పున్నమినాయుడు, డీఆర్పీ పి.సత్యనారాయణ, ఏపీవో ఆరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒడియా మాధ్యమంలో పరీక్ష నిర్వహించాలి


డైరెక్టర్ దేవానంద రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కవిటి: ఒడియా మాధ్యమంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షను నిర్వహించాలని ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానంద రెడ్డిని శనివారం శ్రీకాకుళంలో కలిసి వినతిపత్రం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి, ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి మాట్లాడుతూ.. ఒడియా విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ మాధ్యమం మాదిరిగానే ఒడియాలోను పరీక్ష నిర్వహించాలన్నారు. నిరుపేద విద్యార్థులు ఒడియా మాధ్యమం కావడంతో తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకునేలా ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించాలని విన్నవించారు. ప్రభుత్వం దృష్టిలో ఈ విషయాన్ని తీసుకువెళ్లి నిర్ణయం తీసుకుంటామని డైరెక్టర్ చెప్పారని వారు తెలిపారు.

విద్యారంగ బలోపేతానికి వృత్యంతర శిక్షణ దోహదం

నరసన్నపేట: విద్యారంగం బలోపేతానికి ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణ దోహదపడుతుందని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు అన్నారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. బోధన సామార్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. హెచ్‌ఎం వెంకట్రావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహనతో హెచ్ఐవీ నివారణ

నరసన్నపేట: గ్రామాల్లో హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన కలిగించాలని కేర్ అండ్ సపోర్టు ప్రాజెక్టు ప్రతినిధులు అన్నారు. డిగ్రీ విద్యార్థులకు హెచ్ఐవీ, సుఖవ్యాధులపై శనివారం ఓ ప్రైవేటు కళాశాలలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మణ, బి.రాంప్రసాద్, ఆర్.లక్ష్మి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తీర గ్రామాలకు భూగర్భ విద్యుత్ లైన్లు

● రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


సంతబొమ్మాళి: రచ్చబండ వద్ద మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, ఆగస్టు 17: తుఫాన్‌ల నుంచి రక్షణకు మండలంలోని తీర ప్రాంతా గ్రామాలు ఉమిలాడ నుంచి పాతమేఘవరం వరకు భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం బోరుభద్రలో రచ్చబండ వద్ద గ్రామస్థులతో మాట్లాడారు. ప్రతి ఏటా సంభవించే తుఫాన్‌ల వల్ల ఈదురుగాలులతో తీరప్రాంత గ్రామాల్లో తరచూ విద్యుత్‌సమస్యలు ఏర్పడుతున్నాయని, దీనిని తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. బోరుభద్ర-పాతమేఘవరం, వడ్డితాండ్ర-రావివలస మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉందని, త్వరలో రోడ్డు విస్తరణ చేపడతామన్నారు. బోరుభద్ర ప్రాంత రైతులకు సాగునీటి సమస్యలు తీర్చేందుకు గరీబుల గెడ్డపై లిఫ్ట్ మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌కు కాకరాపల్లి కాలువ మీదుగా గోవిందపురం వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా ఉపాధి నిధుల తో పక్కా రోడ్డు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. బోరుభద్ర తీరప్రాంత గ్రామాలకు కూడలి గ్రామ మైనందున జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వజ్జ రాములు, అప్పిని వెంకటేష్, వల్లభ వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల సమస్యల పరిష్కారానికి కృషి

కోటబొమ్మాళి: హిజ్రాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన హిజ్రాలు మాట్లాడుతూ.. సమాజంలో మా వర్గాన్ని చిన్నచూపు చూస్తున్నారని, కూటి కోసం ఏదోలా నెట్టుకొస్తుంటే కొందరు హేళనగా చూస్తున్నారన్నారు. మాకు గుర్తింపు ఇచ్చేలా ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఉపాధి కల్పన చేపట్టాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. అనంతరం బ్రహ్మ కుమారీలు అచ్చెన్నాయుడుకు రాఖీ కట్టి ఆశీర్వదించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

జలుమూరు: క్షేత్రస్థాయిలో రోగులకు 104 సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మాకివలసలో శనివారం నిర్వహించిన 104 సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడి సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వాహనం వద్దకు వచ్చిన రోగులకు మాత్రలు పంపిణీతో సరిపెట్టక వ్యాధి నివారణ జరిగే వరకు సిబ్బంది రోగిని పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.హేమలత, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశాలు, టీడీపీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

గంజాయిపై ఉక్కుపాదం

● సాగు, రవాణా నియంత్రణపై దృష్టిపెట్టండి

● ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలకు డీఐజీ గోపీనాథ్ జెట్టీ


ఎస్పీలతో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా నియంత్రణపై గట్టిగా దృష్టి సారించాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశించారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వంద రోజుల కార్యాచరణపై ఎస్పీలతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. కైలాసగిరిలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశమై గంజాయి నియంత్రణ, కేసుల దర్యాప్తు, నిందితులపై చర్యలకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉంటూ పరారీలో ఉన్న వారిని పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. నేరస్తులను పట్టుకునేందుకు నిర్దిష్ట కాలపరిమితిని డీఐజీ నిర్దేశించారు. గంజాయిని ఇతర రాష్ట్రాలకు రవాణా చేసేందుకు వినియోగించే మార్గాలను గుర్తించాలని ఎస్పీలను ఆదేశించారు. ఏజెన్సీతో అనుసంధానమైన మైదాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంతోపాటు తగినంత సిబ్బందిని నియమించి, డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. తరచూ గంజాయి రవాణాకు పాల్పడుతున్న 59 మందిపై పీడీ యాక్ట్‌కు ప్రతిపాదనలు చేశామని, దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉందని డీజీఐ వివరించారు. కంటైనర్లలో గంజాయి రవాణా గుర్తించేందుకు వీలుగా నర్సీపట్నం, అనకాపల్లిలో స్నిఫర్‌డాగ్ స్క్వాడ్‌ను అందుబాటులోకి తెచ్చామని అనకాపల్లి ఎస్పీ దీపికాపాటిల్ వివరించారు. 2024లో ఇంతవరకూ విశాఖ పరిధిలోనే 223 గంజాయి కేసులు నమోదుచేసి రూ.4.75 కోట్ల విలువైన 9,517 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఐజీ వివరించారు. ఈ కేసుల్లో 545 మందిని అరెస్టు చేయగా...వారిలో 249 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారన్నారు. నిందితుల నుంచి 155 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి సాగవుతున్న ప్రాంతాలు ఒడిశా సరిహద్దు జిల్లాల్లో అత్యధికంగా ఉన్నట్టు శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించామన్నారు. గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాలకు ఎస్పీలు, ఇతర అధికారులు వెళ్లి ప్రత్యామ్నాయ పంటలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఐజీ ఆదేశించారు. దీనికోసం ప్రభుత్వ శాఖల అంతర్గత కమిటీ ఏర్పాటుచేసి తరచూ గ్రామాల్లో అవగాహన సమావేశాలు, కళాజాతలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నిషేధం, వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాలపై గిరిజనులకు అర్థమయ్యేలా ముఖ్యమైన జంక్షన్లు, ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏడీపీఎస్ స్పెషల్ ప్రాసిక్యూటర్ వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి రోషిణి


మాట్లాడుతున్న న్యాయాధికారి రోషిణి

పాతపట్నం: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా హక్కుల పరిరక్షణకు దోహదపడుతుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి అన్నారు. స్థానిక సచివాలయం-3లో మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులై ఉండి వితంతు పింఛన్ మంజూరు కాకుంటే దరఖాస్తులు అందజేయాలన్నారు. మహిళా భద్రతా చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, న్యాయవాది ఎం.రమణ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

పలాస: ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం స్థానిక అన్నపూర్ణ థియేటర్ రోడ్డులో శనివారం నిర్వహించారు. ఆ సంఘ జాతీయ కార్యవర్గసభ్యుడు డి.మహరాణ, జిల్లా అధ్యక్షుడు జగదీష్ సంఘ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** గొట్టిపల్లి వృద్ధాశ్రమంలో సోమవారం ఏపీయూడబ్ల్యూజే 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. ● **ఇచ్ఛాపురం:** ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం యూనియన్ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ దేవేంద్రరెడ్డి అందజేశారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. ● **సోంపేట:** ఏపీడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోంపేట సామాజిక ఆసుపత్రిలో రోగులకు శనివారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



మెళియాపుట్టి: చినహంస గ్రామంలో శుక్రవారం వీచిన గాలులకు విరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను శనివారం సిబ్బంది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గొప్పిలి ఫీడర్ నుంచి చినహంస గ్రామానికి వచ్చే మార్గంలో ఆరు స్తంభాలు నేల కొరిగిన సంగతి తెలిసిందే. దీంతో విద్యుత్ నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ట్రాన్స్‌కో అధికారులు స్పందించి చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జడ్పీటీసీ సొంత నిధులతో విద్యుత్ సదుపాయం

హిరమండలం: హిరమండలంలోని నౌగూడ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత నిధులతో విద్యుత్ కనెక్షన్ కల్పించడంతో పాటు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లను ఏర్పాటు చేసినట్లు జడ్పీటీసీ బుచ్చిబాబు తెలిపారు. గత నెలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించగా కార్యకర్త కేంద్రంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించారు. ఈ మేరకు హామీని నిలబెట్టుకున్నారు. వీటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆయనతో పాటు విద్యాకమిటీ చైర్మన్ దానుపురం చిన్నారావు తదితరు లున్నారు.

'ఓపెన్' స్కూల్‌ను వినియోగించుకోవాలి

మెళియాపుట్టి: ఓపెన్ స్కూల్ అవకాశాలను విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని ఎంఈవోలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభం అన్నారు. శనివారం సచివాలయం వెల్ఫేర్ అధికారులు, అంగన్‌వాడీ, విద్యా శాఖ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే చదువు మధ్యలో మాని వేసిన వారికి ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఓపెన్ విధానంలో పదవ తరగతి, ఇంటర్‌లో పరీక్షలు రాసుకునే అవకాశం ఉందని, ఈ దిశగా వారిని చైతన్యం చేయాలన్నారు.

కంచుమాయి కాలనీలో విష జ్వరాలు

మందస: మందస మేజర్ పంచాయతీ కంచుమాయి కాలనీలో విష జ్వరాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఇంటిలోనూ జ్వరాలతో బాధపడుతున్న వారున్నారు. వీరంతా సంచి వైద్యులను సంప్రదిస్తున్నారు. కాలనీకి సమీపంలో పీహెచ్‌సీ ఉన్నప్పటికీ అటువైపు వైద్య సేవల కోసం వెళ్లడం లేదు. గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన వి.వెంకటరమణ, గాయత్రి, స్నేహ, అలాగే మరో ఇంటిలో కొండ లక్ష్మి, పార్వతీశం, హేమవతి, ఎం.ప్రసాదరావు, ఎం.లక్ష్మి, భవానీశంకర్ జ్వరాలతో బాధపడుతున్నారు. వీరంతా వారం రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో పారిశుధ్య పను లు చేపట్టకపోవడంతో జ్వరాలు సోకుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

హరిపురం: బెల్లుపటియా గ్రామంలో కోతుల దాడితో వృద్ధురాలు కొండల సావిత్రి తీవ్ర గాయాల పాలైంది. శనివారం ఆమె పొలం పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా గెడ్డ వద్ద కోతులు దాడి చేశాయి. దీంతో ఆమె తలపై, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. అదే దారిలో వస్తున్న స్థానికులు కోతులను బెదిరించి ఆమెను సిరిపురం పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. కోతుల బెడద ఎక్కువ గా ఉందని పలు గ్రామాల ప్రజలు అటవీ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇసుక రవాణాతో కుంగిన కల్వర్టు

● మూడు రోజులుగా నిలిచిపోయిన వాహనాలు


కల్వర్టుకు మధ్యలో ఏర్పడిన రంధ్రం


బారులు తీరిన వాహనాలు

కొత్తూరు: అంగూరులో కేటాయించిన ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుక తరలింపునకు మూడు రోజులుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడి నుంచి టెక్కలి డివిజన్‌కు సంబంధించి పలాస, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, నందిగాం, నౌపడ తదితర ప్రాంతాలకు ఇసుకను తీసుకువెళ్లాల్సి ఉంది. అయితే అంగూరు వద్ద ఉన్న కల్వర్టుపై రంధ్ర ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదరవు తున్నాయి. మూడు రోజులుగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఇసుక తరలింపు జరగడం లేదు. ఇసుక కోసం తెచ్చిన డబ్బులు భోజనానికి ఖర్చయిపోతున్నాయని డ్రైవర్లు వాపో తున్నా రు. ఈ విషయమై తహసీల్దార్ బడే పాపారావు వద్ద ప్రస్తావించగా సమస్య తన దృష్టికి వచ్చిందని, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, మైన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

అన్న క్యాంటీన్లకు పూర్వ వైభవం


అన్నక్యాంటీన్ వద్ద బారులు తీరిన ప్రజలు

అరసవల్లి: శ్రీకాకుళం నగరంలో ప్రారంభించిన అన్న క్యాంటీన్లలో భోజనం చేసేందుకు నిరుపేదలు బారులు తీరారు. శనివారం ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండ్ వద్ద ఉన్న క్యాంటీనకు నిరుపేదలు, ఉపాధి కూలీలు వినియోగించుకుని రూ.5కే వారి ఆకలిని తీర్చుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు, జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించిన సంగతి తెలి సిందే. అన్న క్యాంటీన్లకు పెద్ద ఎత్తున పేదలు తరలివచ్చి భోజనం చేసి కూటమి ప్రభుత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

మందస: బంగ్లాదేశ్‌లోని హిందూ మైనార్టీలకు రక్షణ కల్పించాలని, హిందువులపై జరుగుతున్న హింసాకాండలను నిలువరించాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మందసలో శనివారం ర్యాలీ చేపట్టారు. బంగ్లాదేశ్‌లో అమానుషంగా హిందువులను హింసకు గురి చేస్తున్నా ప్రపంచ దేశాలు ఖండించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పొందర దుదిష్టి, రట్టి లక్ష్మణరావు, చంద్ర, కిశోర్ మాస్టారు పాల్గొన్నారు.

టీటీడీలో కచేరీకి ఎంపిక

ఇచ్ఛాపురం: తిరుమల వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో భక్తిరంజని కార్యక్రమం నిర్వహించేందుకు పట్టణానికి చెందిన చిన్నా గురుస్వామి కచేరీ బృందం ఎంపికైంది. ఈనెల 19న తిరుపతిలో చిన్నా గురుస్వామి బృందం హరినామ సంకీర్తనలో పాల్గొంటారు. గత 15 ఏళ్లుగా ప్రతిఏటా ఈ బృందానికి టీటీడీ చక్కటి అవకాశాన్ని కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు.

లక్ష్యాల సాధనలో ముందుండాలి

టెక్కలి: ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో ముందుండాలని ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి అన్నారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో ఆయా విభాగాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, తాగునీరు నిర్వహణ తదితర సమీక్షించారు. ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటంకం లేకుండా తాగునీటి సరఫరా

నరసన్నపేట: మేజర్ పంచాయతీలో తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో చిన్నారావు అన్నారు. శనివారం బొంతలవీధిలో తాగునీటి కొళాయిల ద్వారా నీటి సర ఫరా కాకపోవడాన్ని పరిశీలించారు. ఇంటింటికీ కొళాయిలు అందించనున్నామన్నారు.

రెల్లివీధి సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: మండల కేంద్రంలోని రెల్లివీధిలోకి హడ్డుబంగి గెడ్డ నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ అన్నారు. శనివారం వీధి లో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. ఇళ్లలోకి నీరు చేరుతున్నా అధికారులు స్పందించక పోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక దళిత నేతలు దూళి అప్పన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: చినవంక గ్రామానికి చెందిన వి.డిల్లీశ్వరరావు అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందతున్న విషయం తెలుసుకుని పూండి యువతరం సభ్యులు శనివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. యూత్ అధ్యక్షుడు చింత మురళి తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి: జిల్లా కేంద్ర ఆసుపత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన


పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది



నరసన్నపేట: సామాజిక ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న వైద్యులు



ఎచ్చెర్ల: ర్యాలీలో పాల్గొన్న ఎచ్చెర్ల, పొన్నాడ పీహెచ్‌సీల వైద్య సిబ్బంది

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కోల్‌కతా ఘటనపై నిరసన
- జిల్లా వ్యాప్తంగా వైద్యుల ఆందోళన

ఇటీవల కోల్‌కతాలో ఓ జూనియర్ వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వైద్యులు, వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిరసన ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. ఐఎంఏ, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, వివిధ అనుబంధ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మద్దతుగా నిలిచారు. వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. పలాసలో జరిగిన నిరసనలో ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని వైద్యులకు సంఘీభావం తెలిపారు.

- ఆంధ్రజ్యోతి బృందం



కాశీబుగ్గ: ర్యాలీలో పాల్గొన్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


పలాస: కేటీరోడ్డు ఎస్‌బీఐ జంక్షన్ వద్ద..


జి.సిగడాం: ర్యాలీలో జి.సిగడాం, బాతువ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది


అరసవల్లి: నినాదాలు చేస్తున్న పీఎంపీల సంఘ ప్రతినిధులు



బూర్జ: ర్యాలీలో పాల్గొన్న గుత్తావల్లి, బూర్జ పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది


వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి పీహెచ్‌సీ వద్ద .,


శ్రీకాకుళం రూరల్: ధర్నా చేస్తున్న జెమ్స్‌లో వైద్య విద్యార్థులు, వైద్యులు


ఆమదాలవలస: తొగరాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది


సోంపేట: బారువ ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



జలుమూరు: సారవకోటలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది


సంతబొమ్మాళి: నిరసన చేపడుతున్న వైద్యసిబ్బంది


లావేరు: పీహెచ్‌సీ ఆవరణలో..


ఎల్ఎన్ పేట: పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యాధికారులు, సిబ్బంది



మెళియాపుట్టి: ర్యాలీగా వెళ్తున్న వైద్య సిబ్బంది


హిరమండలం: మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు


కొత్తూరు: నిరసన తెలుపుతున్న గ్రామీణ వైద్యుల సంఘ ప్రతినిధులు


ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భూలోకమాత విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన విగ్రహం కాళ్లు

ఇచ్ఛాపురం: లొద్దపుట్టి గ్రామంలో భూలోక మాత విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన రోకళ్ల జానకి పూజ కోసం ఆలయం వద్దకు వెళ్లారు. ధ్వంసమైన విగ్రహాన్ని చూసి గ్రామస్థులకు తెలియజేశారు. దీంతో గ్రామస్థులంతా అక్కడికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. ఎన్నో దశాబ్దాలుగా కొలుస్తున్న భూలోక మాత విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారి కాళ్ల భాగాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్రగాయాలు


నుజ్జయిన లారీ క్యాబిన్

నందిగాం: పెద్దినాయుడుపేట సమీపంలో హైవేపై శనివారం లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న లారీ పెద్దినాయుడుపేట వద్ద షడన్‌గా నిలిపివేయడంతో అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన మరో లారీ బలంగా ఢీకొంది. దీంతో ఢీకొన్న లారీ డ్రైవర్ వినోద్‌కుమార్ పాటిల్, క్లీనర్ అంజనకుమార్ సింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్యాబిన్‌లో ఇరుక్కొని హాహాకారాలు చేసిన డ్రైవర్‌ను హైవే, పోలీసు సిబ్బంది క్రేన్ సాయంతో బయటకు తీశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వినోద్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అంజన్‌కుమార్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దువ్వాడ వాణికి నోటీసు జారీ

టెక్కలి: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నివాసం బయట న్యాయపోరాట దీక్ష చేపడుతున్న ఆయన భార్య, టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణికి శనివారం టెక్కలి పోలీసులు 41 నోటీసులు జారీచేశారు. ఈ నోటీసును అందించేందుకు ఎస్ఐ వెంకటేశ్వరరావు వెళ్లగా వాణి నిరాకరించారు. ముందుగా శ్రీనివాస్‌కు నోటీసిచ్చిన తరువాతే తనకు ఇవ్వాలని ఆమె ఎస్ఐకి స్పష్టం చేశారు. అయితే దీనికి ఎస్ఐ బదులిస్తూ ఆయన ప్రజాప్రతినిధి అయినందున కొంత సమయం పడుతుందని పేర్కొని సర్ది చెప్పినప్పటికీ ఆమె నిరాకరించారు. దువ్వాడ వాణి, కుమార్తెలు హైందవి, నవీనలతో కలిసి ఆ ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్సీ శ్రీనివాస్ వారిని అడ్డుకోవడంతో ఎనిమిది రోజుల కిందట పోలీసులకు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు.

వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి

పలాస రూరల్: కిష్టుపురం గ్రామానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి నిమ్మాడ శ్రీనివాసరావుపై ఆటో డ్రైవర్ వేదమూర్తి దాడి చేసి గాయపరిచిన ఘటన శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీనివాసరావు ఇంటి ముందు అదే గ్రామానికి చెందిన వేదమూర్తి ప్రతిరోజూ తన ఆటోను నిలుపుతుండేవాడు. ఈ విషయమై శ్రీనివాసరావు సదరు వ్యక్తిని శనివారం గట్టిగా ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగి వివాదం పెరిగింది. దీంతో ఆటోడ్రైవర్ వేదమూర్తి ఇనుప రాడ్‌తో శ్రీనివాసరావు తల, గుండెపై గట్టిగా కొట్టి గాయపర్చాడు. బాధితుడిని ఆయన కుటుంబసభ్యులు హుటాహుటిన పలాస సామాజిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. బాధితుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం అర్బన్: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో శ్రీకాకుళం రూరల్ మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి గొండు శంకర్ పాల్గొని పలు శాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 1వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల్లో అధికారులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఇప్పటికే ప్రారంభించిన పనులను పూర్తి చేయాలని బిల్లులు చెల్లించే బాధ్యత తనదని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే శంకర్ భరోసా ఇచ్చారు. నైరా, కళ్లేపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న సామాజిక భవనాలను కూడా పూర్తి చేయాలని సూచించారు. అలాగే పైలెట్ ప్రాజెక్టుగా కరజాడ గ్రామాన్ని మోడల్ పంచాయతీగా మారుస్తామన్నారు. రాగోలు గ్రామాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేసేందుకు ప్రజాభిప్రాయాన్ని తీసుకోనున్నట్టు తెలిపారు. ఎరువుల కొరత ఉందని ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తీసుకురాగా జేడీతో ఫోన్లో మాట్లాడారు.

మైన్స్ అధికారులపై ఆగ్రహం

సర్వసభ్య సమావేశానికి మైన్స్ అధికారులు హాజరుకాకపోగా కంప్యూటర్ ఆపరేటర్‌ను పంపించడంపై ఎమ్మెల్యే గొండు శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా ఆర్ఐగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా.. సమావేశానికి రాకుండా ఎక్కడికి వెళ్లారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు ఇంటి పనులకు ఇసుక కరువైందని, నాటు బళ్లను కూడా ఆపేస్తున్నారని సర్పంచ్‌లు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా దీనిపై మైన్స్ అధికారులకు వివరణ కోరగా సమాధానం చెప్పేవారు కరువయ్యారు. నాటుబళ్లతో పోగులేసి లారీలకు తరలించేవారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో గణపతిరావును ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ ప్రకాశరావు, జడ్పీటీసీ రుప్ప దివ్య, ఎంపీటీసీ అంబటి నిర్మల, సత్యనారాయణ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా పన్ను చెల్లించని ఆస్పత్రి

- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన సర్పంచ్, ఎంపీటీసీ
- చర్యలు తీసుకోవాలని ఆదేశం

శ్రీకాకుళం అర్బన్: ఓ ప్రైవేట్ ఆస్పత్రి మూడేళ్లుగా ప్రభుత్వానికి హౌస్ ట్యాక్స్ చెల్లించడం లేదని రాగోలు సర్పంచ్, ఎంపీటీసీ శనివారం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి నుంచి రూ.1,02,80,589 బకాయి రావాల్సి ఉందని, ఇప్పటికే సచివాలయ కార్యదర్శి రెండుసార్లు నోటీసులు ఇచ్చినా యాజమాన్యం స్పందించడం లేదన్నారు. పైగా సచివాలయ కార్యదర్శిపై ఆస్పత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. గతేడాదికి గాను ఇటీవల రూ.15 లక్షల పన్ను మాత్రమే చెల్లించారని చెప్పారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ వి.ప్రకాశరావును ఎమ్మెల్యే వివరణ కోరగా.. మూడేళ్లుగా హౌస్ ట్యాక్స్ చెల్లించకపోవడం వాస్తవమేనని, ఇప్పటికే ఆస్పత్రికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. ప్రస్తుతం నిర్మించిన అదనపు భవంతులకు కూడా పన్ను వేయాల్సి ఉందని చెప్పారు. మరోసారి నోటీసు జారీ చేయాలని, అప్పటికీ స్పందించకుంటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

విలువలతో కూడిన విద్యను నేర్పండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: విలువలతో కూడిన విద్యను బోధించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం తొగరాం గ్రామం వద్ద ఉన్న కేజీబీవీలో వన్ స్టాప్ సెంటర్ ఆడపిల్లలను చదివిద్దాం.. రక్షిద్దాం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు లేని పిల్లలు నిరాశ్రయులైన పిల్లల కోసం కేజీబీవీలు ఏర్పాటయ్యాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సూక రాజు, సంపదరావు మురళి, బొడ్డేపల్లి గౌరీపతి, లక్ష్మీనారాయణ, గుడ్ల దుర్గాప్రసాద్, తమ్మినేని అప్పలనాయుడు, కేజీబీవీ ప్రిన్సిపాల్ శిరీష, ఏఎస్ఐ రేణుకారాణి, సోషల్ కౌన్సిలర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఒడియా మైనార్టీలను ఆదుకునేలా చర్యలు


ఎమ్మెల్యే అశోక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కవిటి: ఒడియా మైనార్టీలను కూటమి ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకుంటానని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. వింధ్యగిరి గ్రామంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానించారు. ఒడియా మైనార్టీల్లోని కొన్ని వర్గాలను వెనుకబడిన జాబితాలో చేర్చేందుకు కూటమి ప్రభుత్వ సహకారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ విషయాన్ని సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కార్యక్రమంలోరౌళో కులపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఎచ్చెర్ల: కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాన్ని శనివారం అందజేశారు. బొడ్డేపల్లి సౌజన్య, గంట్లాన హేమంత్‌కుమార్, లొట్ల సంధ్యలకు రూ.1,116 వంతున నగదు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, రిటైర్డు పంచాయతీ కార్యదర్శి బొడ్డేపల్లి అప్పారావు, మాజీ ఎంపీటీసీ బొడ్డేపల్లి హేమలత, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సుధాకర్, ఉపాధ్యాయులు బొడ్డేపల్లి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లావేరు పీహెచ్‌సీపై ఇంకా జగన్ ఫొటోయే..



జగన్ ఫొటోతో కూడిన బోర్డు

లావేరు: మండల కేంద్రం లావేరు పీహెచ్‌సీ వద్ద గత ప్రభుత్వం అప్పటి సీఎం జగన్ ఫొటోతో కూడిన బోర్డు నేటికీ అలాగే ఉంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు జరిగి సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇంకా లావేరు పీహెచ్‌సీ గోడకు జగన్ ఫొటోయే ఉంది. లావేరు పీహెచ్‌సీ గోడకు ఇలా జగన్ ఫొటో ఉండటంపై వైద్యాధికారులకు, సిబ్బందికి ఇంకా మమకారం పోలేదేమోనని చికిత్స కోసం వచ్చేవారు చర్చించుకుంటున్నారు.

పేషెంట్ రిలేషన్ అసోసియేట్‌గా అవకాశాలు

శ్రీకాకుళం, (ఆంధ్రజ్యోతి): ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి పేషెంట్ రిలేషన్ అసోసియేట్ గా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణ మూడు మాసాల పాటు అందిస్తామని చెప్పారు. ఈ శిక్షణ ఎచ్చెర్లలోని టీటీడీసీలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి, యూనిఫామ్, మెటీరియల్ వంటి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. 30 ఏళ్లలోపు వయసున్న యువతీ యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కోర్స్‌తోపాటు పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు వైజాగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి- ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు స్పష్టంచేశారు. అలాగే డిప్లమో పారామెడికల్, బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు శ్రీకాకుళం సమీపంలో రాగోలులో జెమ్స్ క్యాంపస్‌లో తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

హద్దు మీరితే జైలు శిక్ష తప్పదు

శ్రీకాకుళం క్రైం: చట్టాలను అతిక్రమిస్తూ నేరాలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని వన్‌టౌన్ ఎస్ఐ కామేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద శనివారం కొంత మంది యువత బైక్‌లపై చక్కర్లు కొడుతుండటంతో వారిని పట్టుకుని ఎస్ఐ కామేశ్వరరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

షెడ్యూల్ కులాలను విభజించే హక్కు లేదు

శ్రీకాకుళం అర్బన్: షెడ్యూల్ కులాలను, తెగలను విభజించే హక్కు ఎవరికీ లేదని దళిత ఐక్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బెంజిమెన్ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆదివారంపేట నుంచి ఏడు రోడ్ల కూడలి సూర్యమహల్ నుంచి రైతుబజార్ మీదుగా అంబేడ్కర్ భవనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఆదివారంపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 341 ఆర్టికల్ ప్రకారం పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదం లేకుండా ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం కన్వీనర్ ఎన్.భరత్ భూషణ్‌రాజు, ఎస్సీ టీచర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోతల దుర్గారావు, ఎజ్రా, మురళీకృష్ణ, అప్పారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

24న గార మండల సమావేశం

గార: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గొండు రఘురాం అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అందరు మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

కవిటి: చింతామణి ట్రస్టు (హైదరాబాదు)కు చెందిన ప్రతినిధులు మండల కేంద్రానికి చెందిన విద్యార్థి పి.జస్వంత్‌కు ఆర్థిక సాయాన్ని అందించారు. శనివారం కవిటిలోని ఓ కార్యక్రమంలో రూ.50వేలు విద్యార్థి తల్లికి అందజేశారు. ఇంజనీరింగ్ చదువుతున్న ఈ విద్యార్థికి గత మూడేల్లుగా ట్రస్టు సహకారాన్ని అందిస్తుంది. కవిటి నేతలు బి.రమేష్, ఎ.మధు, పి.చంద్రశేఖర్, పి.ఉమా, బి.రవి, శేషాచలం, శ్రీను, ఉమాపతిలు ఉన్నారు.

మళ్లీ వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నిక

సరుబుజ్జిలి: మండలంలో శనివారం జరగాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. గత వారం కొండవలస, పురుషోత్తపురం జడ్పీ హైస్కూల్, పురుషోత్తపురం ప్రాథమిక పాఠశాల, ఫకీరుసాహెబ్‌పేట, ఇసకలపాలెం, పెద్దసవలాపురంలో జరగాల్సిన ఎన్నికలు కోరం లేక వాయిదా వేశారు. అయితే ప్రస్తుతం పురుషోత్తపురం ప్రాథమిక, కొండవలస ప్రాథమికోన్నత పాఠశాలలకు మాత్రమే ఎన్నిక పూర్తయింది. మిగిలిన వాటిలో కోరం లేక మళ్లీ వాయిదా వేసినట్టు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన అనుమతులు మేరకు ఎన్నికల తేదీని ప్రకటిస్తామని ఎంఈవో డి.బాలరాజు వెల్లడించారు.

సీఐల బదిలీలు

శ్రీకాకుళం క్రైం: విశాఖ రేంజ్ పరిధిలోని 52 మంది సీఐలను శనివారం రాత్రి బదిలీలయ్యాయి. ఈ క్రమంలో జిల్లా నుంచి నలుగురు సీఐలు బదిలీ కాగా, పక్క జిల్లాల నుంచి నలుగురు సీఐలు బదిలీపై జిల్లాకు రానున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి సీఐగా పనిచేస్తున్న అంబటి విజయ్‌కుమార్‌ను టెక్కలి అర్బన్ సీఐగా, కాశీబుగ్గ సీఐగా రాజాంలో పనిచేస్తున్న దాడి మోహన్‌రావును, ఆమదాలవలస సీఐగా పాండ్రంకి సత్యనారాయణ నియమితులయ్యారు. శ్రీకాకుళం ఉమెన్ పోలీసు స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ వెంకటరావును అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగలకు, ఆమదాలవలస సీఐగా పనిచేస్తున్న జి.దివాకర్ వాయనందన యాదవ్‌ను వీఆర్‌కు, కాశీబుగ్గ సీఐ ఎల్‌హెచ్‌వీ ఆనందను విశాఖ వీఆర్‌కి, టెక్కలి సీఐగా పనిచేస్తున్న పి.పైడయ్యను విశాఖ వీఆర్‌కు బదిలీ చేశారు. విశాఖ వీఆర్‌లో ఉన్న బోర ప్రసాదరావు కళింగపట్నం మెరైన్ సీఐగా నియమించారు.

21 వాహనాలకు జరిమానా

ఇచ్ఛాపురం: ఎటువంటి పత్రాలు లేకుండా నడుపుతున్న 21 వాహనాలను పట్టుకొని అపరాధ రుసుము విధించామని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. శనివారం లొద్దపుట్టి జంక్షన్ జరడా రోడ్‌లో వాహనాలను తనిఖీ చేపట్టారు. బైక్‌కు సంబంధించి పత్రాలు లేకుండా వెళ్లినవారికి, హెల్మెట్, లైసెన్సులు లేకుండా, సీట్ బెల్టులు లేకుండా కార్‌లు నడిపిన వారినుంచి రూ.12,235 వసూలు చేశామన్నారు.

పశువుల పట్టివేత

హరిపురం: మందస మండలం హరిపురం హైవేపై వ్యానులో అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు శనివారం పట్టుకొన్నారు. వేకువజామున వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు బరంపురం నుంచి విజయనగరం జిల్లా అలమండకు ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా 9 గేదెలు, 4 దూడలున్న వ్యాన్‌ను సీజ్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.